



• బోధన్‌లో చిక్కీ చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ఇళ్లు



చెరువుల కబ్జాపై చర్యలెప్పుడు?

- జిల్లాలో చెరువులు, కుంటలు కబ్జా
- ఆనవాళ్లు కోల్పోతున్న కాలువలు, వాగులు
- కొంత మంది నేతల అండదండతో యథేచ్ఛగా భూ ఆక్రమణలు
- ఏళ్ల తరబడి కబ్జాలకు పాల్పడుతున్నా పట్టించుకోని యంత్రాంగం
- భారీ నిర్మాణాలతో వరద సమయంలో నిలుస్తున్న నీరు
- జిల్లాలోనూ 'హైడ్రా' తరహో ఏర్పాటు చేస్తే తగ్గనున్న ఆక్రమణలు

నిజామాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో చెరువులు, కుంటలు కుచించుకుపోతున్నా.. చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నా అధికారుల చర్యలు కరువయ్యాయి. ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారులు చర్యలకు వెనకాడుతున్నారు. దీంతో ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు అన్యాక్రాంతమవుతున్నాయి. నిజాంసాగర్ కాలువల భూములతో పాటు చెరువుల భూముల్లో కొందరు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి ప్రభుత్వాలు కొన్ని ఇళ్లకు పట్టాలు ఇవ్వడం వల్ల నిర్మాణాలు చేసుకొన్నారు. వీటినే ఆసరా చేసుకొని కొందరు కబ్జాలకు పాల్పడ్డారు. కొంత మంది నేతలు రింగ్‌గా ఏర్పడి ఈ భూములను అమ్మకాలు చేశారు. వీటికి ఇంటి నెంబర్లతో పాటు విద్యుత్ కనెక్షన్‌లను ఇప్పించారు. కొన్ని భూములకు రిజిస్ట్రేషన్ కూడా చేపట్టారు. కొన్ని శాఖల అధికారులు ఫిర్యాదులు చేయడంతో కేసులు కాగా కొంతమంది అధికారులపై కూడా చర్యలకు ఉపక్రమించారు. ఇదే పరిస్థితి బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీల పరిధిలోనూ ఉంది. వీటి పరిధిలోనూ కూడా కాలువలు, చెరువుల శిఖాలను ఆక్ర మించి నిర్మాణాలు చేశారు. రెండేళ్ల కింద జిల్లాలోని అన్ని చెరువుల భూముల వివరాలను సాగునీటి శాఖ అధికారులు పరిశీలించారు. కబ్జాలో ఉన్న భూములపై చర్యలు తీసుకోవాలని అప్పటి అధికారులు విన్నవించినా చర్యలు మాత్రం చేపట్టలేదు.

రోజురోజుకూ పెరుగుతున్న భూముల ధరలు

జిల్లాలో భూముల ధరలు ఇరవై ఏళ్లుగా పెరుగుతున్నాయి. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో ఈ భూముల ధరలు ఎక్కువగా పెరిగాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర ప్రధాన రహదారులపై ఉన్న భూములకు భాగా ధరలు వచ్చాయి. ఎక్కువ మంది ఇళ్ల నిర్మించుకునేందుకు రియల్ ఎస్టేట్ వారిని ఆశ్రయించారు. కొన్ని చోట్ల ప్రభుత్వానికి చెందిన భూముల్లో కూడా అప్పటి ప్రభుత్వాలు పేదలకు పట్టాలను పంపిణీ చేశారు. వ్యవసాయ భూములు ప్లాట్లుగా మార్చి అమ్మకాలను చేశారు. ప్రభుత్వ స్థలాల పక్కనే ఉన్న చెరువు శిఖం భూములు ఎక్కువగా కబ్జా చేసి వాటిని విక్రయించారు. మున్సిపాలిటీల పరిధిలో చెరువులతో పాటు దేవాలయాల భూములు కూడా కబ్జాకు గురయ్యాయి.

అక్రమార్కులకు నేతల అండదండలు

కబ్జాలకు పాల్పడే వారికి అధికార పార్టీ నేతల అండదండలు ఉండటం వల్ల కొన్నేళ్లుగా ఈ భూముల కబ్జాలు యథేచ్ఛగా కొనసాగాయి. అధికారులపై ఒత్తిడిలు పెరగడం, అక్రమాలకు కొంత మంది అధికారులు సహకరించడం వల్ల ఎక్కువగా కబ్జాలకు గురయ్యాయి. ఇంటి నెంబర్లు ఇవ్వడం, పన్నులు వసూళ్లు చేయడం వాటి రశీదుల ఆధారంగా కరెంటు సరఫరా కోసం కనెక్షన్‌లు తీసుకోవడంతో పాటు కొన్ని ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. రెండేళ్ల క్రితం కొంత మంది అధికారులపై కూడా కేసులు నమోదు అయ్యాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది.

నగర పరిధిలో జోరుగా కబ్జాలు

నిజామాబాద్ నగరం పరిధిలో పలు చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. కొన్ని చెరువుల్లో ఎక్కువ మొత్తంలో కబ్జాకు గురికాగా మరికొన్ని చెరువుల్లో ఎఫ్‌టీఎల్ ఏరియాల్లో నిర్మాణాలు చేశారు. నగరం పరిధిలోని అర్సపల్లి, రామర్తి, బొందంచెరువుతో పాటు పలు కాలనీల పరిధిలోని చెరువులు ఆక్రమించారు. నిజాంసాగర్ కాలువ వెంట కొంత మందికి పట్టాలు ఇవ్వగా మరికొంత మంది ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం నగరం పరిధిలో ఆ కాలువ ఆనవాలు కోల్పోగా భూములు మాత్రం అన్యాక్రాంతమయ్యాయి. నగరం పరిధిలో పూలాంగ్ వాగు ఒకనాడు భారీగా వరదలు వచ్చిన సమయంలో సుమారు అరకిలోమీటరు వెడల్పున ప్రవహించేది. ప్రస్తుతం ఈ వాగు మొత్తం కుచించుకుపోయింది. మురికి కాలువగా మారింది. పూలాంగ్ వాగు వెంట భారీ నిర్మాణాలు చేయడం వల్ల చిన్నగా మారిపోయింది. వాగుల వెంట బఫర్ జోన్ ప్రాంతంలో భారీ నిర్మాణాలకు అవకాశం లేకున్నా పూలాంగ్ వాగు వెంట బోర్గాం నుంచి ముబారక్‌నగర్ వరకు భారీ అపార్ట్‌మెంట్‌లు ఈ వాగు వెంటనే వెలిశాయి. వాటితో పాటు ఇళ్ల నిర్మాణాలు జరగడం వల్ల మొత్తం విస్తీర్ణం తగ్గిపోయింది. గతంలో పనిచేసిన ప్రజాప్రతినిధులు పూలాంగ్ వాగును పునరుద్ధరిస్తామని పూర్వవైభవం తీసుకువస్తామని ప్రకటనలు చేసినా ఫలితం మాత్రం లేదు. అలాగే బోధన్ పరిధిలోని చక్కీ చెరువులో షెడ్‌ల నిర్మాణం జరిగినా పట్టించుకునే వారు లేరు. ఆర్మూర్ పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆర్మూర్‌లో నిజాంసాగర్ కాలువకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురయ్యాయి. కొన్ని భూముల్లో ఇళ్ల నిర్మాణాలు కూడా జరిగాయి.

'హైడ్రా' తరహో జిల్లాలో ఏర్పాటు చేయాలి..

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) తరహో జిల్లాలో కూడా ఏర్పాటు చేయాలని అనేక మంది భావిస్తున్నారు. బఫర్ జోన్‌తోపాటు చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని కోరుతున్నారు. చెరువుల భూములను స్వాధీనం చేసుకొని కాలువలు, వాగులను పునరుద్ధరిస్తే వరద సమయంలో నీరు సజావుగా బయటకు వెళ్లే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం అన్ని కబ్జాలు కావడం వల్ల వరద నీరు బయటకు వెళ్లకపోవడంపై సమస్యలు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపై వరద చేసి చెరువుల్లా మారుతున్నాయి. ప్రభుత్వం హైడ్రాను అన్ని మున్సిపాల్ కార్పొరేషన్ పరిధిలోనూ విస్తరించే అవకాశం ఉందని వదంతుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు తగ్గే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.



కోతకుగురై మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోని బ్రిడ్జి ఇదే..



రోడ్డు ఇలా.. స్టేషన్‌కు వెళ్లేదెలా?

- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- మూడేళ్ల క్రితం కొట్టుకుపోయిన బ్రిడ్జి
- పట్టించుకోని అధికారులు

మోర్తాడ్, ఆగస్టు 26: మోర్తాడ్ జాతీయ రహదారి నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు మూడేళ్లుగా అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌కు వెళ్లే దారి మధ్యలో నిర్మించిన బ్రిడ్జి భారీ వర్షాలకు కోతకు గురై మూడేళ్లు దాటిపోయింది. అయినా సంబంధిత అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. మొండివాగు ఉధృతికి ఈ బ్రిడ్జి కొట్టుకుపోవడం రెండో సారి కావడం గమనార్హం. పరిసర గ్రామాల వారు బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు ఈ రహదారి గుండానే వెళ్తారు. అంతేగాక కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ పట్టణాల నుంచి వచ్చే ప్రయాణికులు సైతం స్టేషన్ దిగి బస్టాండ్‌కు రావాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు నడవక పోవడంతో ప్రయాణికులు కాలినకడన అవస్థలు పడుతూ వెళ్లాల్సిందే. రాత్రి వేళ స్టేషన్ నుంచి రావాలన్నా.. వెళ్లాలన్నా ప్రయాణికులు జంకుతున్నారు. మొండివాగులో నుంచి నడిచి వెళ్లేందుకు భయపడుతున్నారు. రైల్వే అధికారులు మొండివాగుపై బ్రిడ్జిని పొడవుగా నిర్మించక పోవడం వల్లే వర్షాలకు కొట్టుకుపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా.. స్టేషన్ నుంచి రావాలన్నా విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు రైల్వేలైన్ పక్క నుంచి చెట్ల మధ్యలో నుంచి కాలినడకన వెళ్తున్నారు. కనీసం మట్టి రోడ్డును కూడా రైల్వే అధికారులు ఏర్పాటు చేయకపోవం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్‌ను కోట్ల రూపాయలతో సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, అంతేగాక రైల్వేఓవర్ బ్రిడ్జి పనులు కోట్ల రూపాయలతో జరుగుతున్నాయని మోర్తాడ్‌లో కొట్టుకుపోయిన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం పట్ల ప్రయాణికులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులను గమనించి రైల్వే శాఖాధికారులు స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపటాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



• మురళీకృష్ణ, రాధ వేషధారణలో చిన్నారులు

కన్నుల పండువగా కృష్ణాష్టమి

- ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు
- ఆకట్టుకున్న చిన్నారుల కృష్ణుడి, గోపికల వేషధారణ

జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం కన్నుల పండువగా జరుపుకొన్నారు. గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయాలతో పాటు ఇస్కాన్, భక్తి వేదాంత, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం నైవేద్యాలను సమర్పించారు. జిల్లా కేంద్రంతోపాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ డివిజన్‌లలో కృష్ణుడికి ప్రత్యేక పూజలు జరిపారు .

- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్





• నగరంలో ఉట్టి కొట్టేందుకు పోటీపడుతున్న యువకులు



• వేల్పూర్‌లో ఉట్టికొడుతున్న విద్యార్థులు

- ప్రాజెక్టులోకి 24వేల క్యూసెక్కుల వరద
- కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

ఎస్సారెస్పీకి జలకళ

మెండోర, ఆగస్టు 26: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద చేరుతుండడంతో జలకళను సంతరించుకుంటుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం విష్ణుపురి బలేగావ్ బాబ్లీప్రాజెక్టుల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈఈ వంశీ తెలిపారు. ఇప్పటి వరకు 58 టీఎంసీల వరద వచ్చి చేరిందని ఆయన తెలిపారు. ఉదయం ప్రాజెక్టులోకి 34952 క్యూసెక్కుల వరద చేరగా.. మధ్యాహ్నం ప్రాజెక్టులోకి 28450 క్యూసెక్కుల వరద తగ్గింది. సాయంత్రానికి 24073 క్యూసెక్కుల వరద కాస్త తగ్గుముఖం పట్టింది. అలాగే ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటల కోసం కాకతీయ, లక్ష్మీకాలువలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 50 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 541క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి కోసం 231 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుందని ప్రాజెక్టు ఏఈఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా, సోమవారం సాయంత్రానికి 1084.1 అడుగులు (56.980టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజు ప్రాజెక్టులో 1090.60 అడుగులు (78.868టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని ఆయన తెలిపారు.



రెగ్యులర్ వీసీల నియామకం ఎప్పుడు?

వీసీలు లేక అభివృద్ధికి నోచుకోని యూనివర్సిటీలు

సమావేశంలో టీయూ పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, ఆగస్టు 26: యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను ఎప్పుడు నియమిస్తారని టీయూ పీడీఎస్‌యూ నాయకులు రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెగ్యులర్ వీసీ నియామకాలు చేపట్టకపోవడం వల్ల యూనివర్సిటీలో అభివృద్ధి పనులు జరగడంలేదన్నారు. నిత్యం సమస్యలతో యూనివర్సిటీలు కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. ఇన్‌చార్జి వీసీలు యూనివర్సిటీలను సందర్శించడం లేదని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నూతనంగా బాలికల హాస్టల్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వంశీ, యాదగిరి, మణికంఠ, సాయిప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అభ్యర్థుల ఆందోళన

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 26: నగరంలోని ప్రగతినగర్ ప్రాంతంలో ఉన్న సింక్రో సర్వ్ గ్లోబల్ సొల్యూషన్ సంస్థలో శిక్షణ కాలం పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని శిక్షణ పూర్తయిన అభ్యర్థులు సోమవారం సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధానమంత్రి కౌశల్ యోజన కింద వివిధ కోర్సులు పూర్తి చేసిన తమకు సర్టిఫికెట్ ఇవ్వడం లేదని శిక్షణ పూర్తయిన 20 రోజుల్లోపు సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉండగా మూడు నెలలు పూర్తయినా ఇవ్వడం లేదని అభ్యర్థులు తెలిపారు. సర్టిఫికెట్లు ఇవ్వమంటే కొంత మంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వందలాది మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసి తమ సమయాన్ని వృధా చేసుకున్నారని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సర్టిఫికెట్లు ఇవ్వాలని లేదంటే ఆందోళన చేస్తామని అభ్యర్థులు తెలిపారు.

రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలి

పెద్దబజార్, ఆగస్టు 26: అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు రుణాలను రీషెడ్యూల్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రుణమాఫీ కాని రైతులందరూ ఈనెల 29న జరిగే మండల ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి'

పెద్దబజార్, ఆగస్టు 26: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని తెలంగాణ ప్రగతిశీల కూరగాయల వ్యవసాయ మార్కెట్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు మచ్చ మోహన్ అన్నారు. సోమవారం నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో వ్యవసాయ కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సెప్టెంబరు 13న ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల ప్రాంతీయ సదస్సుకు అన్ని రంగాల కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు మల్లేష్, వీరయ్య, శంకర్, గంగాధర్, ధర్మయ్య, సోనుబాయి పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ మహాసభలను జయప్రదం చేయాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 26: ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ ఏడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సుప్రియ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు హైదరాబాద్‌లో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 31న ఎస్‌టీవో నుంచి ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ అనంతరం ఇందిరాపార్కులో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీలలో కాట్రగడ్డ శ్రీనివాస్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతినిధుల మహాసభలు ఉంటాయని అన్నారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజిత, వాసరి శైలజ, సుమలత, దేవిక, నర్సుబాయి, భూదేవి, సుజాత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

'డైట్ సప్లయి టెండర్లను రద్దు చేయాలి'

ఖిల్లా, ఆగస్టు 26: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డైట్ సప్లయి టెండర్లను పూర్తిగా రద్దు చేయాలని అంబేద్కర్ ఎస్సీ, లేబరో కాంట్రాక్ట్ కో ఆప్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు నాయుడు రాజు అన్నారు. సోమవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. టెండర్ల నోటిఫికేషన్‌కు ముందు నుంచే కొందరు అధికారులు టెండర్ దారులతో కుమ్మక్కై గతంలో డైట్ సప్లయి చేసిన వారికే టెండర్ దక్కేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. టెండర్ దరఖాస్తు ఫారాలు పూర్తిగా ఎవరికీ అర్థం కాని పద్ధతిలో పదజాలాన్ని సమకూర్చారని అన్నారు. అదే దరఖాస్తుఫారం వరంగల్‌లో పూర్తి పదజాలం అర్థం అయ్యే రీతిలో ఉందన్నారు. శుక్రవారం జరిగిన స్క్రూట్నీలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధించిన అధికారులు స్క్రూట్నీ చేయకుండానే ఇతర ప్రాంతాల్లో పని చేసే అధికారులను పిలపించి టెండర్లు నిర్వహించారని అన్నారు. టెండర్‌లో పాల్గొన్న వారికి దరఖాస్తులు చేసుకున్నారా, జీఎస్టీ చెల్లిస్తున్నారా, ఐటీ చెల్లిస్తున్నారా, అనుభవం ఉందా అనే ప్రశ్నలతో వారికి ఉక్కిరిబిక్కిరి చేశారన్నారు. కలెక్టర్ దృష్టి సారించి ఈ టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లకు పిలవాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్‌జాదవ్, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టయ్య, బీసీ నాయకులు దేవందర్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

చింతకుంట సిద్ధుల గుట్ట ఆలయంలో అన్నదానం



ఆలయం వద్ద భక్తుల సందడి

మోస్రా,ఆగస్టు26: మండలంలోని చింతకుంట గ్రామంలో అటవీ ప్రాంతంలో కొలువుదీరిన సిద్ధుల గుట్ట ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గత ఏడు రోజుల నుంచి సప్తా భజన కార్యక్రమాలు నిర్వహించి నేడు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇక్కడ గల రుక్మిణి విఠలేశ్వర స్వామి, నవనాథ్ సిద్దేశ్వర స్వామి ఆలయాలు, పురాతన మహిమ గల ఆలయాలుగా తెలిపారు. మోస్రాతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యల భక్తులు పాల్గొన్నారు.

అమీనాపూర్‌లో కూలిన పాఠశాల ప్రహరీ

వేల్పూర్, ఆగస్టు26:మండలంలో గల అమీనాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ ఆకస్మాతుగా కూలిపోయింది. విద్యార్థులు పాఠశాలలో ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పాఠశాలకు సెలవు ఉండడం వల్ల విద్యార్థులకు పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

29 నుంచి మండల స్థాయి క్రీడలు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు26: ఈనెల 29తేదీ నుంచి ఆర్మూర్ మండలస్థాయి రూరల్ అంతర్ పాఠశాలల క్రీడలు చేపూర్‌లోని క్షత్రీయ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంఈవో రాజగంగారాం తెలిపారు.మూడు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడలకు కన్వీనర్‌గా జడ్పీహెచ్‌ఎస్ చేపూర్ చేతనకుమారి, కోకన్వీనర్‌గా లక్ష్మీనర్సింహస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.గంగాధర్ పీడీ చేపూర్, కోఆర్గనైజింగ్ కార్యదర్శిగా బ్రుగెష్‌లు వ్యవహరిస్తారని ఎంఈవో తెలిపారు.

శివాలయానికి పోటెత్తిన భక్తజనం



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నభక్తులు

బోధన్‌రూరల్,ఆగస్టు26:బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం నాల్గవ సోమవారం కావడంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మందర్నా, కల్దుర్కి తదితర గ్రామాల నుండి భక్తులు పాదయాత్రగా శివాలయానికి చేరుకున్నారు. సోమవారం శివాలయం శివనామస్మరణతో మారుమ్రోగింది. వేద పండితులు గణేష్ మహరాజ్, ప్రవీణ్ మహరాజ్ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోధన్ తహసీల్దార్ విఠల్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులఉ మహేష్ పాఠక్, ఆలయ ఏవో రాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు హరికాంత్ చారి, భూమేష్, మహేష్, రాజు, సుధాకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీలు పనిచేయాలి

● పదవులు కాదు.. రైతులే శాశ్వతం ● రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు పోచారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్

కోటగిరి,ఆగస్టు26: మార్కెట్ కమిటీలు రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ సలహదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కోటగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో సోమవారం పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతుతో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే వారికి పదవులు వరిస్తాయని అందుకు ప్రస్తుత చైర్మనే నిదర్శమని పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, రైతులు శాశ్వతంగా ఉంటారని వారి ఆశలు, ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత పాలకులపైనే ఉందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. పండించిన పంటను మార్కెట్ కమిటీలో నిల్వ చేసుకుని రుణం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు నెలల్లోపు ఎలాంటి వడ్డీ లేకుండా మార్కెట్ కమిటీ రుణం అందిస్తుందన్నారు. మార్కెట్‌లో తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే సౌకర్యం మార్కెట్ కమిటీలతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రైతులు తలెత్తుకునేలా ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిందన్నారు. రుణమాఫీ అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల మాఫీలో జాప్యం జరుగుతుందన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించి రైతులకు రుణ విముక్తి కల్పిస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఎక్కడ అవినీతికి తావులేకుండా రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు. బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి పోకుండా ఉండేందుకు తాను పార్టీని మారినట్లు ఆయన పేర్కొన్నారు. తాను నియోజకవర్గ అభివృద్ధికే తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయ్యాయని ఆయన పేర్కొన్నారు. పనులు పురోగతి సాధించాలంటే తాను పార్టీ మారాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.ప్రజలు కట్టబెట్టిన పదవులను కాపాడుకోవడం కన్నవారి ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చడమే తన కర్తవ్యంగా భావిస్తానని ఆయన మరోమారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు,మాజీజడ్పీటీసీలు శంకర్‌పటేల్, హెగ్డోలిశంకర్,నాయకులు ఏజాజ్ ఖాన్,గంధపు పవన్,షాహెద్, సిరాజ్,సిద్దు పాల్గొన్నారు.

ఆర్మూర్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



ఆర్టీసీ డీఎంకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు26: ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ ప్రాంగణంలో గల హోటళ్లు, ఇతర దుకాణ సముదాయాలను పరిశీలించారు. సరుకులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్లలో శుభ్రత పాటించాలని, నాణ్యత కూడిన ఆహారం, తినుబండరాలు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఫోన్ ద్వారా ఆర్ఎంతో మాట్లాడిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆర్టీసీ హద్దులను గుర్తించి చుట్టు ప్రహరీ నిర్మించాలని, అదే విధంగా మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతూ చెత్తచెదారం ఎప్పటి కప్పుడు తీయించి బస్టాండ్ పరిసరాల్లో శుభ్రంగా ఉంచాలని అన్నారు. చైన్ స్నాచింగ్, ఇతర దొంగతనాలు జరుగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చేనెల 15లోగా షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు26: వచ్చేనెల 15వ తేదీలోగా ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణాలు మాఫీ చేయాలని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని కుమార్‌నారాయణ భవనంలో విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు వి.ప్రభాకర్, ఇట్టెడి లింగారెడ్డి, దేగాం యాదగౌడ్, నూతుల శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎకరానికి రూ.15వేల రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం నిరక్ష్యంగా రైతులను ఆందోళన గురి చేసే విధంగా మంత్రులు తల ఒక మాటాడుతున్నారని వారు ఆపేక్షించారు. రుణమాఫీ రాని విషయాన్ని రైతులే రైతుకుటుంబాన్ని ధ్రువీకరించుకొని నిర్ధారించే విధంగా ఈయాప్‌ను తయారు చేశా మనడం సరికాదన్నారు. తప్పుడు డిక్లరేషన్ ఇస్తే రికవరీ చేస్తామనే ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. వచ్చేనెల 15వ తేదీ వరకు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయని పక్షంలో 16వ తేదీన సమావేశమై ఉద్యమకార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో దేవరాం, సక్కి సుధాకర్, సంతోష్‌రెడ్డి, లోక రాములు, బాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు

ఘనంగా మథర్‌థెరిస్సా జయంతి



నివాళి అర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు26: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణం లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో సోమవారం మథర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మథర్‌థెరిస్సా విగ్రహానికి పూలమలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, సభ్యులు వెంకట్రాంరెడ్డి, ఉదయ్, భైరి శ్రీధర్, తదిత రులు పాల్గొన్నారు.

● లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణ లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో మథర్‌థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మథర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పశ్చిమ బెంగాల్‌లోని కల్‌కత్తా నగరంలో నిర్మల్‌హృదయ చారిట్రబుల్ ట్రస్ట్ ద్వారా పేదవారికి, కుష్టువ్యాధి రోగులకు అండగా ఉండి మథర్‌థెరిస్సా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పొల్కం వేణు, సభ్యులు అల్జాపూర్ రాజేష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

బోధన్‌రూరల్,ఆగస్టు26: బోధన్ మండలంలోని ఘన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద లక్ష్మణ్ అనే వ్యక్తి వ్యవసాయ పొలం పనులకు వెళ్తూ అక్కడ వాహనాన్ని నిలిపి ఉంచగా గుర్తు తెలియని దొంగలు ద్విచక్ర వాహనాన్ని దొంగలించారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఫిర్యాదుదారుడు దిలీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి దొంగను పట్టుకుని త్వరలోనే వాహనాన్ని బాధితుడికి అందజేస్తామని ఆయన తెలిపారు.

మోతె రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు

వేల్పూర్ ఆగస్టు26: మోతె గ్రామ ప్రజల ఆరాధ్యదైవమైన రాజరాజేశ్వరస్వామి గుట్ట వద్ద ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో గురడిరెడ్డి గాంధీ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గురడిరెడ్డి గాంధీ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలి

ధర్పల్లి, ఆగస్టు 26: మండల కేంద్రంలో గల డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి వారికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇండ్లులేని నిరుపేదలతో కలిసి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన ఇంత వరకు పంపిణీ చేయడంలో జాప్యం వహిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లను పేదలకు పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. వెంటనే పూర్తయిన ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్, రంజిత్,నూర్జహాన్, జమునలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు వైద్యపరీక్షలు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు26: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ఎస్సీ, బీసీ బాలికల పాఠశాలలోని విద్యార్థినిలకు యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రమేష్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య పరీక్షల అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బట్టు ఆనంద్, హాస్టల్ వార్డెన్‌లు జయసుశీల, షబాన, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వరాలయంలో శ్రావణమాస పూజలు

సదాశివనగర్,ఆగస్టు 26: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి వీరభద్రేశ్వర ఆలయంలో శ్రావణమాసం నాల్గొవ సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి శివనామస్మరణ చేశారు. అనంతరం మహాయజ్ఞం నిర్వహించారు.ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వాదించారు.

బాన్సువాడలో కురిసిన వర్షం



బాన్సువాడలో వర్షం కురుస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , ఆగష్టు 26 : బాన్సువాడ పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఆశించిన విధంగా వర్షం కురియకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా కురిసిన వర్షంతో ఆరుతడి పంటల ఎదుగుదలకు దోహదపడుతోందని రైతన్నలు పేర్కొంటున్నారు.

జోడు లింగేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

బీర్కూర్, ఆగస్టు 26 : బీర్కూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట జోడు లింగేశ్వర ఆలయం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గాంధారి, ఆగస్టు 26: మండలంలోని పోతంగల్ కలాం బుగ్గగండి సమీపంలో జరుగుతున్న కామారెడ్డి బాన్సువాడ ప్రధాన రహదారి బీటీరోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని ఎల్లారెడ్డి మదన్‌మోహన్‌రావు కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆర్అండ్‌బీ అధికారులు తొందరగా పనులు చేయించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి మంజూరుచేసిన క్రీడామైదానం స్థలాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పరిశీలించారు. త్వరలోనే క్రీడామైదానం పూర్తవుతుందన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

దోమకొండ, ఆగస్టు 26 : పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.11,900 స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం సోమవారం దోమకొండ గ్రామంలో రైతు వేదిక వద్ద ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి వారిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన ధర్మారం(ఏ) విద్యార్థి



అవార్డు అందుకుంటున్న హర్షవర్ధన్

నవీపేట, ఆగస్టు 26 : మండలంలోని దర్మారం(ఏ)కు చెందిన సూరహర్షవర్ధన్ అనే 10 సంవత్సరాల విద్యార్థి జాతీయస్థాయి కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఆదివారం చెన్నైలో సీఎస్ఐ బెయిన్‌స్కూల్‌లో జరిగిన షోషిన్‌కయ్ కప్-2024 కరాటే పోటీలలో బాలుర జూనియర్ విభాగంలో హర్షవర్ధన్ గోల్డ్‌మెడల్ సాధించాడు. హర్షవర్ధన్ తండ్రి సూరవెంకట్ హైదరాబాద్‌లోని ఐడీపీఎల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. హర్షవర్ధన్ హైదరాబాద్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. కరాటే మాస్టర్ రాజావర్ధన్ వద్ద అతడు శిక్షణ పొందాడు. కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన హర్షవర్ధన్‌ను తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.


భక్తులతో కిక్కిరిసిన శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం



భిక్కనూరు శ్రీ సిద్దరామేశ్వర ఆలయంలో భక్తుల తాకిడి

భిక్కనూరు, ఆగస్టు 26 : భిక్కనూరు మండలంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్దరామేశ్వర ఆలయం శ్రావణమాస సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజామున నుంచే ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నానమాచరించి క్యూలో నిలబడి స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి, మాతా భువనేశ్వరీ అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేదమంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కోడెలు కట్టి, గండదీపాలు తీసి, పుట్టువెంట్రుకలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున దుకాణాలు వెలిశాయి. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం నుంచి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చండి



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

డిచ్‌పల్లి,ఆగస్టు 26 : డిచ్‌పల్లి బస్టాండ్, నడిపల్లి పంచాయతీ కార్యాలయం ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్ ను ఎత్తైన గద్దెపైకి మార్చాలని స్థానికులు విన్నవించినా ట్రాన్స్‌కో అధికారులు మాత్రం తమకు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి, ఈ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను తగిలి మూగ జీవాలు మరణిస్తున్నాయి విద్యుత్ అధికారులు వెంటనే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌పార్మర్‌ను నూతనంగా నిర్మించిన గద్దెపైకి మార్చు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హెల్మెట్ భారం కాదు.. భద్రత



హెల్మెట్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రుద్రూరు, ఆగస్టు 26 : హెల్మెట్ భారం కాదు భద్రత అని, ద్విచక్ర వాహనదారులు తమ విధిగా హెల్మెట్‌ను ధరించాలని రుద్రూరు ఎస్ఐ పి.సాయన్న పేర్కొన్నారు. సోమవారం అంబర్ (ఆర్) గ్రామంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంబం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌ను ధరించాలని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల సురక్షిత ప్రయాణం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం



కోదండరామ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ మధుశేఖర్

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు26: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను చేయూత సేవ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్ సోమవారం పట్టుశాలువ, పూలబొకెతో సన్మానించారు. గవర్నర్ కోటలో ఎమ్మెల్సీగా నియామితులైన కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కలిసి పని చేసిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

లింగమయ్య ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న ట్రస్ట్ కార్యదర్శి వాసుగౌడ్

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 26 : ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో లింగమయ్య ఆలయ అభివృద్ధికి రాంనోముల చారిట్రబుల్ ట్రస్ట్ వారు రూ.25వేల విరాళంగా అందజేశారు. పిప్రి గ్రామానికి చెందిన నోముల రాంచందర్‌రెడ్డి తన జన్మదినం పురస్కరించుకొని సొంత గ్రామంలో ఆలయ అభివృద్ధికి రూ.25వేలను ట్రస్ట్ కార్యదర్శి వాసుగౌడ్ దేవాలయ కమిటీ సభ్యులు కొమ్ముల రాజేందర్, లింబాద్రిలకు అందజేశారు. రాంచందర్‌రెడ్డి తన ట్రస్ట్ తరఫున గ్రామంలో గ్రంథాలయం, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక పాఠశాలలో విద్యావాలంటీర్‌ను నియమించినట్టు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో దేవేందర్, అల్లకొండ నర్సయ్య, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



మృతిచెందిన సిరిగిరి సాయన్న

డొంకేశ్వర్, ఆగస్టు 26 : చేపలు పట్టేం దుకు వెళ్ళిన వ్యక్తికి వల చుట్టుకొని నీటిలో మునిగి మృతిచెందిన ఘటన సోమవారం డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సిరిగిరి సాయన్న(45) సోమవారం మధ్యాహ్నం ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో చేపలు పట్టేందు కు వెళ్ళాడు. చేపలు పట్టే క్రమంలో వల కాళ్ళకు చుట్టుకొని ప్రమాద వశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. మారంపల్లి గ్రామానికి చెం దిన నర్సయ్య మత్స్యకారుడు కాగా చేపలు పట్టి కుటుంబాన్ని పోషి స్తు న్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

రెంజల్‌లో మరొకరు..



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రెంజల్ : మండలంలోని పేపర్ మిల్ గ్రామానికి చెందిన బోయి రాజు(41) అనేవ్యక్తి చేపల వేటకు వెళ్లి మృతిచెందాడు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో చేపలు పట్టడానికి వెళ్తున్నానని చెప్పి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. దీంతో నీలా పెద్దవాగు చెక్‌డ్యాంప్ వద్ద అతనికి సంబంధించిన బట్టలు కనిపించగా అతని కోసం వాగులో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం కందకుర్తి నదిలో మృతదేహం లభ్యం కావడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సాయన్న జాల్లర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేపు శాంతియుత నిరసన దీక్ష

● సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ ఉపాధ్యక్షుడు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 26 : సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 28న జిల్లా కలెక్టరెట్‌లో శాంతియుత నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ ఉపాధ్యక్షులు పొలాస అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిస్టోలో పొందుపర్చిన విధంగా తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శాంతియుత నిరసన దీక్షకు జిల్లాలోని ఉపాధ్యాయులు, బోధనేతర ఉద్యోగులు, డీపీవో ఉద్యోగులు, మండల విద్యావనరులకేంద్రంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, మెసేంజర్లు, కాంప్లెక్స్ పరిధిలో పనిచేసే సీఆర్పీలు, పాఠశాల స్థాయిలో పనిచేసే పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌లు, భవిత కేంద్రాలలో పనిచేసే ఐఈఆర్పీలు, సీజీవీలు శాంతియుత నిరసన దీక్షకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

దోమకొండలో రాజేశ్వరుడి ఊరేగింపు

దోమకొండ, ఆగస్టు 26: మండల కేంద్రంలోని పలుగడ్డలో గల రాజేశ్వరుడి ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శావను వివిధ రకాల పూలతో ఆలంకరించారు. సాయంత్రం రాజేశ్వరుడు విగ్రహన్ని శావలో పెట్టి భజన పాటలతో ఉరడమ్మ, సుభాష్, పలుగడ్డ మీదుగా ప్రధాన వీధుల గుండా ఉరేగించి విగ్రహాన్ని ఆలయంలోకి తీసుకెళ్లారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి భజన మండలి సభ్యులచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శావ నిర్వహకులు తేల్ల లింగం మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే శ్రావణమాసంలో భాగంగా శావ కార్యక్రమం పలు కాలనీల నుంచి ఊరేగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భక్తులు బాల్‌రాజవ్వ, పెద్ద లక్ష్మీ, లింగవ్వపోచవ్వ, తేల్ల నాగయ్య, నవీన్, శ్రీహరి పాల్గొన్నారు.

'అవార్డు రావడం వల్ల మరింత బాధ్యత పెరిగింది'



నిజామాబాద్ ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ సాయన్న సన్మానిస్తున్న దృశ్యం

పెద్దబజార్, ఆగస్టు 26: రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం వల్ల మరింత బాధ్యత పెరిగిందని నిజామాబాద్ ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ సాయన్న అన్నారు. సోమవారం నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో గల ఆర్టీసీ రెండో డిపోలో డ్రైవర్స్, కండక్టర్లు, సిబ్బంది, మెకానిక్‌లు మేనేజర్‌కు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ సాయన్న మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండి సజ్జనార్‌ల చేతుల మీదుగా ఉత్తమ డీఎం అవార్డు అందుకున్నందుకు ఉద్యోగులు సంతోషంతో సన్మానించారని అన్నారు. ఉద్యోగులందరి సమిష్టి కృషి పట్టుదల అంకితభావం వల్ల అవార్డు అందుకోవడం జరిగిందని తెలిపారు. ఉద్యోగులు వారి విధులను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దత్తాద్రి, కార్యదర్శి పుట్ట జైరాజ్, రీజినల్ అడ్వైజర్ పరుశురాం, మెకానికల్ ఫోర్‌మెన్, సూపరింటెండెంట్, ఎస్‌టీఐ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇందల్వాయి, ఆగస్టు 26: ఇందల్వాయి మండలంలోని లోలం, ఇందల్వాయి గ్రామాలలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇందల్వాయి గ్రామ కోఆప్షన్ మాజీ మెంబర్ ఖుర్షీద్ భార్య ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం లోలం గ్రామంలోని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దాస్ తండ్రి బూసాని మధు కుటుంబాలను పరామర్శించారు. వారితో మాట్లాడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితులకు ఎల్లవేళలా అండగా ఉంటానని అధైర్యపడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్‌నాయకులు పాశంకుమార్, రఘు,పార్టీ ఉపాధ్యక్షుడు శెట్టిబిరీష్, ఇందల్వాయి మాజీ సర్పంచ్ పాశం నర్సింలు, గంగాదాస్, మాజీ ఎంపీటీసీ సుధాకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు కాశీరాం, తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,ఆగస్టు26: పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఆదివారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమ్మర్‌పల్లి,ఆగస్టు26: మధ్యలో బడిమానివేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా 2024-25 విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్‌మీడియట్ చదివేందుకునే ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పసుపుల సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకోవడానికి సెప్టెంబరు 20 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజులు చెల్లించుకోవచ్చన్నారు.సెప్టెంబరు 11నుంచి అక్టోబరు 3వరకు అపరాధ రుసుముతో ఫీజులు చెల్లించే అవకాశం ఉందన్నారు.విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదవతరగతి దరకాస్తులకొరకు ఇదివరకు చదివిన పాఠశాలకు సంబంధించిన ఆ విద్యార్థి యొక్క టీసీ, బోనాఫైడ్ లేదా బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు ఫొటోలు మూడు సెట్లుగా సమర్పించాలన్నారు.

● ఇంటర్ విద్యార్థులు

ఇంటర్‌మీడియట్ పరీక్షలు రాయలనుకున్న విద్యార్థులు టెన్త్ మెమో, టీసీ, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు రెండు సెట్లుగా సమర్పించాలన్నారు. గత సంవత్సరం పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయలనుకుంటే అట్టివిద్యార్థులు ఆగస్టు 31 లోగా కమ్మర్‌పల్లి స్టడీ సెంటర్‌లో పరీక్ష ఫీజులు చెల్లించాలని కోరారు. అదనపు సమాచారం కోసం 9000358082 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత

బోధన్‌రూరల్,ఆగస్టు26: బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కోటగిరి మండలం జల్లాపల్లి గ్రామానికి చెందిన కేతావత్ జయరాం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో ఏప్రిల్ నెలలో ఫోన్ పొగొట్టుకున్నాడని, బోధన్ రూరల్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసు సిబ్బంది గుర్తించి బాధితుడికి ఫోన్ తిరిగి ఇచ్చేశారు. మొబైల్ ఫోన్ వాడే వారు తమ ఫోన్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.


పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


రాధాకృష్ణుడి వేషధారణలో చిన్నారులు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


శివాజీనగర్ కృష్ణ మందిర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

● జిల్లావ్యాప్తంగా సంబరాలు ● పాల్గొన్నచిన్నారులు, యువకులు, గ్రామస్థులు

శ్రీకృష్ణ జన్మాష్టమిసంబరాలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. జిల్లాలోని అన్ని మండల గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషధారతో చిన్నారులు రాధ,గోపిల వేషధారణలతో ముచ్చట గొలిపి సందడి చేశారు. జిల్లాలో పలు గ్రామాల్లో యువకులు ఉట్టి కొట్టి కొడుతూ కేరింతల మధ్య ఆనందోత్సవాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెద్దబజార్, ఆగస్టు 26: నగరంలోని దుబ్బ ప్రాంతంలోగల శ్రీకృష్ణ దేవాలయంలో సోమవారం జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక, 9వ డివిజన్ కార్పొరేటర్ సాయివర్ధన్, నారాయణయాదవ్, నగర యాదవ సంఘం సభ్యులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: జగద్గురువుగా కొలిచే శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సోమవారం ఆలయాల్లో శ్రీకృష్ణుడి మూల విగ్రహానికి వేదమంత్రాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక తులసీ అర్చనలు జరిపారు.

● ఇస్కాన్ ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇస్కాన్ సంస్థ నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. ద్వారకనగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉదయంనగర సంకీర్తన, భజన, కీర్తన, ప్రత్యేక పూజలు, శ్రీకృష్ణ లాలామృత శ్రవణం, మహా హారతి, చప్పన్‌భోగ్ 53 రకాల నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. విజయలక్ష్మి గార్డెన్‌లో నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో ఇస్కాన్ సంస్థ సభ్యులు శ్రీకృష్ణుడికి అభిషేకం నిర్వహించి నామకరణ ఉత్సవం జరిపారు.

బోధన్ పట్టణంలో రాధాకృష్ణ ఆలయంతో పాటు పలు మందిరాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీటీ నగర్‌లోని శ్రీలక్ష్మీనరసింహ, కోట మైసమ్మ దేవాయాల ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. బోధన్ డివిజన్, ఆర్మూర్ డివిజన్,నిజామాబాద్ డివిజన్ మండలాల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. అంతేకాక వివిధ పాఠశాలల్లో విద్యార్థులు కృష్ణుడు,గోపికల వేధారణతో అకట్టుకున్నారు. భీమ్‌గల్‌లో,ఆర్మూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి,ధర్పల్లి, సిరికొండ,ఏర్గట్ల,బాల్కొండ, ముప్కాల్ ,జక్రాన్‌పల్లి,మెండోర,ఎడపల్లి,వర్ని,రుద్రూర్,కోటగిరి,మోస్రా,చందూర్,ఇందల్వాయి,డిచ్‌పల్లిలో శ్రీకృష్ణుడి జన్మాష్టమిని ఘనంగా నిర్వంచారు.అన్నదానం నిర్వహించారు.


ఇస్కాన్ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న భక్తులు


మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో..



ధర్పల్లిలో ఉట్టి కొడుతున్న యువకులు


సిరికొండలో..


వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు


గన్నారంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


బోర్గాంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు


ముప్కాల్ అన్నదానంలో పాల్గొన్న భక్తులు


చందూర్‌లో..


పాఠశాలలో రాధాకృష్ణ వేషధారణలో విద్యార్థులు


రుద్రూర్‌లో పల్లకీ సేవా నిర్వహిస్తున్న భక్తులు


వేల్పూర్‌లో ...



నగరంలో ఉట్టి ని కొడుతున్న యువకులు


శ్రీకృష్ణ వేషధారణలో విద్యార్థులు

నగరంలో ట్రాఫిక్ ప్రక్షాళనకు కసరత్తు

● ఫుట్‌పాత్‌లపై ఉన్న వస్తువుల తొలగింపు



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే సామగ్రిని తొలగిస్తున్న సిబ్బంది

ఖిల్లా, ఆగస్టు26 : నగరంలో ట్రాఫిక్ ప్రక్షాళనకు ట్రాఫిక్ పోలీసులు కసరత్తు మొదలు పెట్టారు. నగరంలో ప్రజలకు ఇబ్బంది కరంగా మారిన ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది సిద్ధమైంది. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ.టి.నారయణ, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకటనారయణల నేతృత్వంలో ఎస్ఐ రహ్మతుల్లా, సిబ్బంది సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లోని వ్యాపారసముదాయాల ఎదురుగా ఏర్పాటు చేసుకున్న ప్రకటన బోర్డులను తొలగించి స్టేషన్‌కు రికవరి వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులకు సిబ్బందికి మధ్య కొంత సేపు వాగ్వాదం జరిగింది. అయినప్పటికి సిబ్బంది మాత్రం ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న వాటిని తొలగించారు. ముఖ్యంగా తీవ్ర రద్దీగా ఉండే ఆర్‌పి.రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ పనులను మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు ప్రతి నిత్యం జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. వారికి నగరంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో పాటు నడువడానికి వీలు లేకుండా ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు కబ్జా చేసి తమ సామాగ్రీని పెట్టుకోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై వస్తున్న ఫిర్యాదుల నేపధ్యంలో అధికారులు స్పందించారు. నగరంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో నియంత్రణ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపి నారయణ, ఇన్స్‌పెక్టర్ వెంకటనారయణలు మాట్లాడుతూ నగర ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు నగరంలో ఎటువంటి ట్రాపిక్ ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి రోజు విడతల వారిగా నగరంలోని ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తామన్నారు.

'విద్యాసంస్థ అవినీతిపై విచారణ జరపాలి'

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 26: శ్రీచైతన్య విద్యాసంస్థ అవినీతిపై సిబిఐ, ఈడిలతో విచారణ జరిపించాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ కనీస మౌలిక వసతులు కల్పించకుండా నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలను నడుపుతున్నారని అన్నారు. ర్యాంకుల కోసం, మార్కుల కోసం విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గతంలో కుళ్లిన కూరగాయలను వండి విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడారని ఈ విషయమై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారని ఫైర్, గ్రౌండ్, అర్హతలు లేని టీచర్లు, స్టాఫ్ ఉన్నారని అదేవిధంగా పీఎఫ్‌లు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వానికి చెల్లిస్తున్న టాక్స్‌లపై విచారణ జరపాలని వచ్చే ఏడాది అడ్మిషన్లను నిలిపివేయాలన్నారు. ఈ సమావేశంలో నిఖిల్, దేవిక, మనోజ్, ముక్తశ్రీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

● ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు ● రూ. 44వేల 980నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం

వేల్పూర్, ఆగస్టు26: వేల్పూర్ మండల కేంద్రంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.44వేల 980నగదుతో పాటు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్ళలపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు

అఖండ శివనామా సప్తాహకు విరాళం

కోటగిరి,ఆగస్టు26: కోటగిరి మండల కేంద్రంలోని పోచారం కాలనీలో శ్రీ అభయబస్వేశ్వర ఆలయంలో కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహ సోమవారంతో మూడో రోజుకు చేరుకుంది. సప్తాహ కార్యక్రమానికి మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎంఏ హకీమ్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. సప్తాహలో భజన, కీర్తనలు, పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం అప్పా, మల్లికార్జున్ పటేల్, ఆలయ కమిటీ సభ్యులు సుదీప్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74400	రూ.68,600	రూ.905

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : స్త్రీ-2 (హిందీ) (10.00, 4.30, 10.50)
: కమిటీ కుర్రాళ్లు (1.15)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.45)
స్క్రీన్-2 : ఏలియన్ రొమ్ములస్ (10.15)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (1.00)
: తంగాలన్ (4.05)
: స్త్రీ-2 (హిందీ) (7.25)
: మారుతినగర్ సుబ్రమణ్యం (10.40)
స్క్రీన్-3 : డిమోంటి కాలనీ-2 (10.20, 4.40, 10.30)
: స్త్రీ-2 (హిందీ) (1.25)
: ఏలియన్ రొమ్ములస్ (ఇంగ్లీష్) (7.45)
స్క్రీన్-4 : మారుతినగర్ సుబ్రమణ్యం (10.00)
: తంగాలన్ (1.10)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.30)
: కమిటీ కుర్రాళ్లు (7.35)
: ఇంద్ర (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20, 4.20, 10.20)
: తంగలాన్ (1.20, 7.20)
స్క్రీన్-2 : డిమోంటి కాలనీ-2 (10.25, 10.20)
: స్త్రీ-2 (హిందీ) (1.30)
: కమిటీ కుర్రాళ్లు (4.30)
: ఆయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.30)
స్క్రీన్-3 : స్త్రీ-2 (హిందీ) (10.20, 10.20)
: మారుతినగర్ సుబ్రమణ్యం (1.20)
: డిమోంటి కాలనీ-2 (4.20)
: డబుల్ ఇస్మార్ట్ (7.10)

దేవి : తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : డబుల్ ఇస్మార్ట్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్